''నాన్నా! ఈ సంబంధం కూడా నచ్చలేదా?'' అడిగాడు శ్రీనివాసరావు కాస్త కోపం మిళితమైన స్వరంతో.

''నచ్చలేదు'' తాపీగా జవాబిచ్చారు వెంకటాచలంగారు.

దాంతో శ్రీనివాసరావుకి కోపం తారాస్థాయికి చేరుకుంది.

# తాతయ్య అంతర్యం

- ఎ.ఎస్.ఎన్.గుప్త

''హూ...మొన్నకు మొన్న హైదరాబాద్ నుంచి నిక్షేపం లాంటి బ్యాంకులో జాబ్ చేసే కుర్రాడొస్తే నచ్చలేదన్నారు. నిన్నకునిన్న గుంటూరు నుంచి క్లాత్ బిజినెస్ చేసే కుర్రాడి సంబంధమొస్తే నచ్చలేదన్నారు. ఇవ్వాళ...బాగా ఆస్తి వుండి వ్యవసాయం చేసుకుంటున్న కుర్రాడ్ని నచ్చలేదంటున్నారు. అసలు నచ్చాల్సింది అమ్మాయికా? మీకా?''

''నాకే'' తాపీగా చెప్పారు వెంకటాచలంగారు.

''ఏం? ఎందుకని? మాకందరికీ నచ్చినది మీకెందుకు నచ్చడంలేదు. ఆస్తంతా మీ స్వార్జితమని, మేమంతా మీ అధీనంలో...''



''ఆపరా'' మధ్యలోనే అందుకున్నారు వెంకటాచలంగారు.

''ఆస్తి నా స్వార్జితమనిగానీ, పెద్దరికాన్ని చూపడంగానీ చేయడంలేదురా. శ్రీదేవి నీ కన్నకూతురే కాదు, నా మనమరాలు కూడా. దాని బాగోగులు, భవిష్యత్తు జీవితం గురించిన శ్రద్ధ నీకే కాదు ఒకరకంగా చెప్పాలంటే నాకు నీకన్నా ఎక్కువే ఉంది.''

''అందుకే నిక్షేపంలాటి సంబంధాలన్నింటినీ నచ్చలేదు అన్న ఒకే మాటతో...'' బాధతో గొంతు పూడుకుపోయిన శ్రీనివాసరావు ఇక మాట్లాడలేకపోయాడు.

''పోనీలే నాన్నా! తాతయ్యకు ఏ కుంటివాడో, గుడ్డివాడో, ఉద్యోగం, సద్యోగం లేనివాడో నచ్చుతాడు. వాళ్లయితే కట్నం తక్కువలో పోతుందన్న ఉద్దేశ్యంలో వున్నారులాగుంది'' అంది శ్రీదేవి అందుకుంటూ.

''అమ్మా! శ్రీదేవి'' బాధగా అన్నారు వెంకటాచలంగారు.

''లేకుంటే ఏంటి తాతయ్యా నీ ఉద్దేశ్యం?'' అంది దుఃఖంతో గొంతు పూడుకుపోతుంటే.

''ఇంతేనా తల్లీ మీరందరూ నన్ను అర్థం చేసుకుంది?'' అంటూ శ్రీదేవిని సమీపించి ఆమె తల నిమురుతూ–

''ఒరేయ్! నేను నచ్చలేదు అనడానికి కారణాలున్నాయిరా. మొదటి కుర్రాడి సంబంధం వచ్చినప్పుడు కాళ్ళు కడుక్కోవడానికి నీళ్లిస్తే చెంబు చెంబు బుడుంగున కాళ్లపైన గుమ్మరించుకున్నాడు. ఖాళీ చెంబు మిగిల్చాడు. రెండో కుర్రాడు చెంబు ఖాళీచేసి మరో చెంబుకై చేయి చాచాడు. మొదటి కుర్రాడి చేతిలో డబ్బు నిలువదు. చేతిలో వున్నదంతా ఖాళీ చేసేరకం. అంటే దుబారా వ్యక్తి. రెండో కుర్రాడు వున్నదంతా ఖర్చు చేసి అప్పుకోసం ఇతరుల దగ్గర చేయి చాచే రకం.''

''అయితే మూడో సంబంధం ఎందుకు నచ్చలేదు?'' మధ్యలోనే ప్రశ్నించాడు శ్రీనివాసరావు.

''వస్తున్నా! ఆ కుర్రాడు మరీ పిసినిగొట్టు. చెంబు నీళ్ళలో చేతిలోకి కాసిని వంచుకుని కాళ్లకు పసుపు రాసుకున్నట్లు కాళ్ళు తడుపుకుని దాదాపు నీళ్ళన్నీ అలాగే ఉంచాడు.''

ఆ కుర్రాడికి మన శ్రీదేవినిస్తే కనీసం మూర మల్లెపూలు కూడా కొనిపెట్టడు సరికదా ఖర్చు పెట్టిన ప్రతి పైసాకి ఆరా అడుగుతాడు.''

''అంటే...''

''ఆ... అందుకే నాకు నచ్చలేదు వాళ్ళు.''

''నన్ను క్షమించండి నాన్నా. మిమ్మల్ని దారుణంగా అపార్థం చేసుకున్నా'' తల వంచుకుని అన్నాడు శ్రీనివాసరావు.

''నన్ను క్షమించు తాతయ్యా'' అంది శ్రీదేవి.

''పిచ్చి తల్లీ'' అన్నారు ఆప్యాయంగా తల నిమురుతూ.

రెండురోజుల తరువాత మరో సంబంధం వచ్చింది హైదరాబాద్ నుంచి. కుర్రాడు ప్రైవేట్ కంపెనీలో అయినా మంచి జాబ్.

ఈసారి కొన్ని జతల కళ్ళు ఆ కుర్రాడిని అబ్జర్వ్ చేయసాగాయి. ఆ కుర్రాడు సగం నీళ్ళుపైన ఖర్చు చేసి, కాసిని నీళ్ళు మిగిల్చి చెంబు ప్రక్కన పెట్టాడు.

''ఈ సంబంధం నీకు నచ్చింది కదూ తాతయ్యా?'' అంది శ్రీదేవి ఆనందంగా.

''అవును. నీకో?''

''పో తాతయ్యా!'' అంటూ తుర్రున పారిపోయింది శ్రీదేవి సిగ్గుపడుతూ.

ఆ తర్వాత నెలరోజులకు శ్రీదేవి రమేష్‌బాబుల పెళ్ళి వైభవంగా జరిపించారు వారడిగిన దానికన్నా ఎక్కువ కట్నకానుకలిచ్చి వెంకటాచలంగారు.

★